# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం : 6 : ఫిబ్రవరి : 2024




## అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సరిహద్దులో అక్రమ రవాణాపై అధికారులు దృష్టి పెట్టారు. చెక్‌పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించారు.

- 8లో



## పొగమంచుతో అవస్థలు

జిల్లాను పొగమంచు వీడడం లేదు. మంచు ప్రభావంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో

## రాష్ట్ర టెన్నికాయిట్ పోటీల్లో బంగారం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ టెన్నికాయిట్ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాలను సాధించింది. టోర్నీలో నిలకడగా రాణించిన జిల్లా క్రీడాకారులు కొవ్వూరు ప్రవీణ్ కుమార్ (పలాస), బొమ్మాళి సిద్దార్ధ (పలాస), కొర్లాం చంద్రపతి (శాస్త్రులపేట), తర్ని విజయ్ కుమార్( శాస్త్రులపేట), పల్లా సువార్త(తలవరం), జాడ సంధ్య(తలవరం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

## న్యూస్‌రీల్

### విధుల్లో చేరిన అడ్మిన్ ఎస్పీ ప్రేమ్ కాజల్



అదనపు ఎస్పీ తిప్పేస్వామి నుంచి చార్జ్ తీసుకుంటున్న కొత్త అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు పరిపాలన విభాగం (అడ్మిన్) అదనపు ఎస్పీగా డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ సోమవారం ఉదయం తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమె బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ జె.తిప్పే స్వామి నుంచి చార్జ్ తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో విభాగం నుంచి ప్రేమ్ కాజల్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆమె పాలకొండ సబ్‌డివిజన్ డీఎస్పీగా పనిచేశారు.

### 43 కిలోల గంజాయి పట్టివేత



నిందితులు, 43కేజీల గంజాయితో పోలీసు సిబ్బంది

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారి, పలాస రైల్వేస్టేషన్ రోడ్డు కలయిక వద్ద ఆదివారం గంజాయి ముఠా పట్టుబడింది. నాలుగు లగేజీ బ్యాగుల్లో 43 కిలోల గంజాయి తరలిస్తుండగా వీరు దొరికిపోయారు. విశాఖపట్నం లైన్స్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ ఫరీష్ సిబ్బందితో సోమవారం వివరాలు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో తాము తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. పలాసలో గంజాయి తరలిస్తున్న ముఠా దొరికిందని, అందులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని అన్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరిలో ఒకరు బ్రహ్మపురం గ్రామానికి చెందిన శంకరం మిశ్రా కాగా, బాల్య గ్రామానికి చెందిన నిరంజన్ సాహూను మరొకరిగా గుర్తించామని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

### 'మాజీ సైనికులు లైసెన్సు గన్‌లను అప్పగించాలి'

శ్రీకాకుళం క్రైమ్ : సెక్యూరిటీ విధుల్లో లేని మాజీ సైనికులు తమ వద్దనున్న లైసెన్స్ గన్‌లను తమ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో జమ చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తనను కలిసిన జిల్లా మాజీ సైనికుల సమాఖ్య సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. ముందుగా ఎస్పీ రాధికను మాజీ సైనికుల సమాఖ్య ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది మాజీ సైనికులున్నారని ప్రశ్నించగా.. సుమారు ఎనిమిదివేల మంది వరకు ఉన్నారని, 600 మంది వరకు సెక్యూరిటీ విధుల్లో ఉన్నారని మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పి.ఈశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఎలక్షన్లలో ప్రెసిడెంటుగా గెలుపొందిన మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పూర్ణ చంద్రరావును ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పి.ఈశ్వరరావు, ఎస్ఎల్‌మూర్తి, బి.సంజీవరావు, వి.సూర్యనారాయణ, పి.మురళీధర రావు, ఎస్.రామకృష్ణ, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

### శ్రీకాకుళం ప్రజలు మంచివారు



ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న సినీ నటుడు సుమన్

నరసన్నపేట: రెండేళ్లుగా సినిమా షూటింగ్‌ల కోసం శ్రీకాకుళం జిల్లాలో తిరిగానని, జిల్లా ప్రజలు చాలా మంచివారని సినీ నటుడు సుమన్ అన్నారు. తనకు శ్రీకాకుళంలో కూడా అభిమానులు ఉన్నారని తెలిపారు. ఆయన మడపాం ఆంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి సిందూరార్చన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె గూటికి పండగొచ్చింది సినిమా షూటింగ్‌లో జిల్లాలో తిరిగానని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక భక్తులు, సుమన్ అభిమానులు సుధాకర్, సూరప్పడు, సూర్యనారాయణ తదితరులు సాదర స్వాగతం పలికారు. పూర్ణ కుంభంతో సత్యవరాగ్రహారానికి చెందిన రుత్వికులు ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ తదితరులు పాల్గొన్నారు. సుమన్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున జనం అక్కడకు చేరుకున్నారు.

# చేతల ప్రభుత్వమిది..



ఒకటా రెండా ముప్పై ఐదేళ్లుగా ఆ ప్రాంత వాసులు బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఒక బస్సు సర్వీసు వేసి పుణ్యం కట్టుకోండి బాబూ.. అంటూ కనిపించిన నాయకులందరినీ వేడుకున్నారు. పదేళ్లుగా అక్కడ అధికారంలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ ఆ ఊళ్ల వేదన వినలేదు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ ప్రాంత ప్రజల కలను నెరవేర్చింది. ఇచ్ఛాపురం నుంచి మశాఖపురం, బిర్లంగి మీదుగా కొళిగాం వరకు బస్సు వేసి టీడీపీ నాయకుల కళ్లు తెరిపించింది.





బిర్లంగిలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ (ఇన్‌సెట్లో) ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ అభివాదం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

### దశాబ్దాల కల నెరవేరిన వేళ

- మశాఖపురం, బిర్లంగి మీదుగా కొళిగాంకు ఆర్టీసీ బస్సు
- ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ




ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నుంచి మశాఖపురం, బిర్లంగి మీదుగా కొళిగాం వరకు సోమవారం తొలిసారిగా ఆర్టీసీ బస్సు రయ్‌మంటూ దూసుకుపోయింది. దారి పొడవునా పల్లె ప్రజల ఆనందాన్ని గమనిస్తూ ప్రయాణం సాగించింది. ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బస్సు సర్వీసు సోమ వారం ప్రారంభమైంది. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఈ సర్వీసును ప్రారంభించారు. టీడీపీ నాయకులు మండలాభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, స్థానిక సమస్యలు తీర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. తమది మాటలు ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు రూ.రెండు కోట్లకు పైగా నిధులు వెచ్చించి ఏడాది కిందట పక్కా తారు రోడ్డు వేసిందని, ఇప్పుడు బస్సు సర్వీసు ప్రారంభించిందని తెలిపారు. మళ్లీ వైఎస్‌జగన్ సీఎం అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల సమన్వయకర్త పాతిర్ల రాజశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఆశి పురుషోత్తమరెడ్డి, సాలిన ఢిల్లీరావు, బాకి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి, నీలాపు శ్రీను, లోపింటి దీనబంధురెడ్డి, రంగాల జానీ, ఆర్టీసీ పలాస డిపో మేనేజర్ ఆర్.ఎస్.నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

#### తొలిసారిగా మా ఊరిలో బస్సెక్కా..



ఈ రోజు చాలా ఆనందంగా ఉంది. నేను పుట్టినప్పటి నుంచి మా ఊరికి ఆర్టీసీ బస్సు రావడం, నేను బస్సు ఎక్కడం ఇదే తొలి సారి. మా గ్రామానికి తారు రోడ్డు వస్తుందని, బస్సు నడుస్తుందని కలలో కూడా అనుకోలేదు. నిన్నటి వరకు ఇచ్ఛాపురం వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా బాధలు చూసి రోడ్డు, బస్సు వేశారు.

- పి.గణేష ఆచారి, బిర్లంగి, ఇచ్ఛాపురం మండలం

#### నమ్మలేక పోతున్నాను



మా గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చిందంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నాను. నాకు పెళ్లయిన దగ్గర నుంచి చూస్తున్నాను.. మా ఊరికి రోడ్డు లేదు, బస్సు సౌకర్యం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏడాది క్రితం తారు రోడ్డు వేశారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సు వేశారు. జగనన్నకు మా ప్రాంతానికి చెందిన వారమంతా రుణపడి ఉంటాము.

- నాథం మహాలక్ష్మి, బిర్లంగి, ఇచ్ఛాపురం మండలం

# సర్వహక్కులకు శ్రీకారం



నరసన్నపేట -1 సచివాలయంలో ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన లబ్ధిదారులు

నిరుపేద ఇల్లాలు ఇప్పుడు ఇంటికి యజమానిగా మారింది. నిన్నటి వరకు శాశ్వత చిరునామా ఎరుగని సగటు జీవి నేడు తన ఇంటిపై సగర్వంగా సర్వ హక్కులు తెచ్చుకున్నాడు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని అద్భుత కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రీకారం చుట్టింది. వైఎస్ జగన్ సర్కారు అర్హులందరికీ ఇంటి పట్టాలు అందించింది. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించడానికి సాయం చేసింది. ఇప్పుడు నిర్మించిన ఇళ్లతో పాటు స్థలాలను యజమాని పేరుతో రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. ఈ రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులు పూర్తి హక్కుదారులుగా మారనున్నారు.

- జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- సచివాలయాల వద్ద సందడి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు




నరసన్నపేట: పేదలను ఇంటి యజమానులను చేస్తూ ప్రభుత్వం అపురూప ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జగనన్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేస్తూ లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి సాహసం ఏ ప్రభుత్వం చేయలేదు. తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేయడంతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 732 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల సందడి కనిపిస్తోంది. జిల్లాలో 30 మండలాల్లో 43 వేలకు పైగా ఇళ్ల పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. దీంట్లో ఇల్లు కట్టుకున్నా.. లేదా స్థలం ఖాళీగా ఉన్నా ఇళ్ల స్థలం ఇచ్చిన వారందరికీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ప్రభుత్వం ఇవ్వనుంది. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

**ప్రత్యేక యాప్..**

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చేందుకు వీలుగా రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. 12 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో రోజుకు కొంత మంది చొప్పున రిజిస్ట్రేషన్లకు సమాచారం ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికి సంబంధిత లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోల వేలిముద్రలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సర్పంచ్, వీఆర్వో తదితరులు

**సచివాలయాల వద్ద సందడి..**

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తుండటంతో మహిళలతో సచివాలయం సందడిగా కనిపిస్తున్నాయి. సోమవారం మేజరు పంచాయతీ పరిధిలోని నరసన్నపేట-1 సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన మహిళలు ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు కల్పిస్తుండటాన్ని స్వాగతిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పదేళ్ల తరువాత అమ్ముకొనేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నారని సంతోషిస్తున్నారు.

#### ఆనందంగా ఉంది



మేము బొంతల వీధిలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. ఎట్టకేలకు జగనన్న ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇచ్చింది. ఇల్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేస్తున్నాం. పనులు చివరి దశలో ఉన్నాయి. ఇళ్ల పనులు పూర్తి అయితే గృహ ప్రవేశం చేసి సొంతింటికి వెళ్తాం. ఇప్పుడు మాకు ఇచ్చిన పట్టాకు రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం, ఇప్పుడు ఆన్‌లైన్ చేయడానికి సచివాలయ సిబ్బంది కబురు చేయడం సంతోషంగా ఉంది.

- కొత్తకోట వరలక్ష్మి, బొంతల వీధి

#### కల నెరవేరింది



మా సొంత ఇంటి కల నెరవేరబోతోంది. ఇళ్ల పనులు చురుగ్గా చేస్తున్నాం. అద్దె బాధలు కొద్ది రోజుల్లో తప్పనున్నాయి. ఈ లోగా ప్రభుత్వం మాకు ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయించి ఉచితంగా ఇస్తుండటం ఆనందంగా ఉంది. జగనన్న మేలు మరిచిపోలేం.

- జాడ సత్యవేణి, కలివరపుపేట

#### త్వరితగతిన పూర్తి చేస్తాం



జగనన్న ఇళ్ల స్థల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం పంచాయతీ పరిధిలో ఇచ్చిన 892 పట్టాలకూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేస్తాం. ఈమేరకు పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు సచివాలయాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశాం. లబ్ధిదారులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, ఇంటి పట్టా తీసుకొని రావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ బాగా జరుగుతోంది.

- సవర చిన్నారావు, ఈఓ, నరసన్నపేట

## స్పందనకు 250 ఫిర్యాదులు



సమస్య ఆలకిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

జిల్లా పరిషత్‌సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 250 వినతులు అందాయి. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తొలిసారిగా జిల్లా స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌లు వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొదటి సారిగా స్పందన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించారు. పౌర సరఫరాలు, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, విభిన్న ప్రతిభావంతులు, ఆరోగ్య తదితర శాఖలు చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని సంబంధిత సిబ్బందితో తెలుసుకున్నారు.

- శ్రీకాకుళం పాతబస్టాండ్

## ఎస్పీ గ్రీవెన్స్‌కు 29 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ రాధిక

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 29 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జీఆర్ రాధిక ఫిర్యాదుదారులతో మాట్లాడి అర్జీలు స్వీకరించారు. చట్టపరిధిలో పరిష్కరించి తగు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు పాల్గొన్నారు. గత ఏడాది డిసెంబర్ 28న ఆత్మహత్య చేసుకున్న విలేకరి గురిజా దామోదరరావు మృతిపై తమకు న్యాయం చేయాలని ఆయన భార్య సుజాత ఎస్పీని కలిసి కోరారు. ఘటన జరిగిన నలభై రోజులవుతున్నా కారకులను పోలీసులు పిలిపించలేదని, మరణానికి గల కీలక ఆధారాలున్న తన భర్త మొబైల్ ఫోన్ తమకు ఇప్పటివరకు చేరలేదన్నారు. తన భర్త మృతికి కారకులైన వారిని శిక్షించేలా విచారణ సాగించాలని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ విచారణ వేగవంతంగానే చేస్తున్నామని, ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ వారు ఇచ్చిన నివేదిక మేరకు విచారణ జరగాల్సి ఉందని తెలిపారు. ఆ నివేదిక ఇంకా రాలేదని, సీజ్డ్ ప్రాపర్టీ విచారణ కాలంలో పోలీసుల ఆధీనంలోనే ఉంటుందని చెప్పారు.

- శ్రీకాకుళం క్రైమ్

## 42 రోజులకు రూ. 35.41 లక్షలు

- ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం లెక్కింపు



హుండీ కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న సహాయ కమిషనర్లు కిశోర్, హరిసూర్యప్రకాష్‌లు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ కానుకల ద్వారా రూ.35,41,176 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివేటి మండపంలో నిర్వహించారు. గత డిసెంబర్ 26 నుంచి సోమవారం వరకు మొత్తం 42 రోజులకు హుండీల్లో లభించిన ఆదాయాన్ని లెక్కించగా.. నగదు రూపంలో రూ.34,60,804, చిల్లర రూపంలో రూ.80,372, బంగారం 20 గ్రాముల 5 మిల్లీ గ్రాములు, వెండి 1 కేజీ 600 గ్రాముల వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కూడా లభించాయి. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ ఈఓ కిశోర్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

- అరసవల్లి

## ఇళ్ల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతంగా చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి ఆయన తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా పేదల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయిస్తోందని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఏ ఒక్క సచివాలయంలో కూడా సున్నా రిజిస్ట్రేషన్ ఉండరాదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు ఉంటే జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**కులగణన పూర్తి కావాలి**

సమగ్ర కులగణన సర్వే జిల్లాలో 85 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 15 శాతం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రతి తహసీల్దార్, ఎంపీడీఓ తమ మండల పరిధిలో కనీసం 200 కుటుంబాల సమాచారాన్ని స్వయంగా పరిశీలించి క్రాస్ చెక్ చేసుకుని నివేదించాలని స్పష్టం చేశారు.

**ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలి**

జిల్లాలో 1.72 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఇంకా పంపిణీ చేయాల్సి ఉందని, ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ కార్డుల పంపిణీ కూడా వీటితో పాటు రానున్న మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని, అందరి మొబైల్ ఫోన్లలో ఆరోగ్య శ్రీ యాప్ కచ్చితంగా డౌన్ లోడ్ చేయించాలని అన్నారు. దీన్ని ప్రాధాన్యత అంశంగా భావించాలని చెప్పారు.

**15వ ఆర్థిక సంఘ నిధులు సిద్ధం**

2022-23 సంవత్సరానికి గాను విడుదలైన 15వ ఆర్థిక సంఘ నిధులకు ఈ గ్రామ్ స్వరాజ్ వెబ్‌సైట్‌లో పూర్తి స్థాయిలో బిల్లులు అప్ లోడ్ చేయాలని కలెక్టర్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి అన్ని కేటగిరీల్లో 2248 విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేయాల్సి ఉందని, వారిలో కొందరి ఆటగాళ్ల బ్యాంకు అకౌంట్ వివరాలు ఇంకా అందుబాటులో లేవని, వాటిని వెంటనే సేకరించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆయా ప్రభుత్వ శాఖల సిబ్బంది వివరాలను ఎన్నికల పోర్టల్‌లో త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

సమావేశంలో సీపీఓ ప్రసన్న లక్ష్మి, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథ రావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవ రావు, మెప్మా పీడీ కిరణ్ కుమార్, శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ ఏవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 9న డీ వార్మింగ్ డే

శ్రీకాకుళం పాతబస్టాండ్: నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఆయన సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నులిపురుగుల నివారణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కింద ఈ నెల 9వ తేదీన నేషనల్ డీ వార్మింగ్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రను తప్పక వేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

## క్లుప్తంగా

### మల్లికార్జున స్వామికి తలపాగా తయారీ



లావేరులో తలపాగా నేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లావేరు గ్రామం పెద్దవీధిలో ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి తలపాగా సమర్పించేందుకు కాశిన వెంకటరమణ సోదరులు పని మొదలుపెట్టారు. తలపాగా పూర్తయిన అనంతరం తిరువీధిగా ఊరేగించి మహాశివరాత్రి పర్వ దినాన శ్రీశైలం వెళ్లి సమర్పిస్తామని తెలిపారు.

### ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజేతలకు అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజేతలను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అభినందించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రజత, కాంస్య పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు సౌమ్య రాణి, మైలపల్లి సత్యంలను సోమవారం ఆయన అభినందించారు. చెన్నై వేదికగా గత నెల 19 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కడపల సౌమ్యరాణి జూడోలో రజతం, మైలపల్లి సత్యం వాలీబాల్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఆ పతకాలతో కలెక్టర్‌ను కలవగా.. ఆయన అభినందించారు.

### లక్ష్మీనారాయణ నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన లక్ష్మీనారాయణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పీఎస్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో పూజారిగా ఉన్న పి.లక్ష్మీనారాయణ(82) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. లక్ష్మీనారాయణ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. నేత్రదానం చేసిన దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 7842699321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్నీషియన్ పి.సుజాత, పవన్‌కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

### చిన్నారులకు ఆర్థిక సాయం



చిన్నారులు శరణ్య, లిఖితలకు నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన చిన్నారులు శరణ్య, లిఖితలకు సాయం కొనసాగుతోంది. సాక్షి దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' అనే శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు సాయం అందజేస్తున్నారు. తాజాగా ఒడిశా రాష్ట్రం కంబిరిగాం గ్రామానికి చెందిన 'కంబిరిగాం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యులు సోమవారం చిన్నారులకు రూ.21,000 వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు, నూతన దుస్తులను స్థానిక సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి నేతృత్వంలో అందజేశారు. పొరుగు రాష్ట్రానికి చెందిన దాతలు స్పందించి చిన్నారులకు ఆర్థిక సాయం చేయడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### ముగిసిన మెగా సైన్స్ ఫెయిర్



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న మెగా సైన్స్‌ఫెయిర్ సోమవారం సాయంత్రం ముగిసింది. మొదటిరోజు పట్టణ ప్రజలు, విద్యార్థుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పోటెత్తగా, రెండో రోజు నగరంతో పాటు శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల, ఆమదాలవలస తదితర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. రెండు రోజులు సందర్శకులతో సైన్స్ ఫెయిర్ కిటకిటలాడుతూ కనిపించింది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్యరాణి, ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్, కో ఆర్డినేటర్‌లు దీపాకుమారి, దేవి, విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ● పొగమంచుతో అవస్థలు

పొగమంచుతో జనం అవస్థలు పడుతున్నారు. గడిచిన రెండు రోజులుగా వేకువన దట్టంగా పొగమంచు కురుస్తోంది. కంచిలిలో ఇలా దారులు కూడా కనబడలేదు. – కంచిలి



రైల్వేస్టేషన్‌లో పొగమంచు



కంచిలి మెయిన్ రోడ్డులో ఆవహించిన పొగమంచు



## ● హ్యాపీగా తాపీగా..



సోంపేటలో సోమవారం తాపీమేస్త్రీల సంఘ భవనాన్ని ప్రారంభించారు. జెడ్పీ నుంచి రూ.10లక్షలతో పాటు ఎంపీపీ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ హాజరయ్యారు. గమేలా, తాపీ పనిముట్లను ఎత్తుకుని తాపీమేస్త్రీలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. – సోంపేట

## విశ్రాంత హోంగార్డుకు రూ. 4.20లక్షల చెక్కు



రూ. 4.20 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ జగదీశ్వరరావుకు సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక తన చేతుల మీదుగా రూ. 4.20 లక్షల చెక్కును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జగదీశ్వరరావు రెండో పట్టణ పీఎస్‌లో విధులు నిర్వర్తించేవారని జిల్లావ్యాప్తంగా ఉన్న తోటి హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని ఈ విధంగా అందజేశారని ఎస్పీ అన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ జిల్లా పోలీసు శాఖలో మీరు ఓ భాగమని, భవిష్యత్‌లో ఎలాంటి అవసరం ఉన్నా ఎల్లవేళలా తోడుగా ఉంటామని జగదీశ్వరరావుకు ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డు ఎస్‌ఐ కేవీ నర్సింగరావు, కుటుంబసభ్యులు ఉన్నారు.

## ప్రజ్ఞా వికాస పరీక్ష ప్రశ్న పత్రం విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమేనని శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ మున్సిపల్ హైస్కూల్లో ఎస్ఎఫ్ఎస్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరగనున్న పదో తరగతి ప్రజ్ఞ వికాస్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను విజయకుమారితోపాటు విశ్రాంత డిప్యూటీ ఈఓ కొత్తకోట అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ విజయకుమారి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఎస్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజ్ఞా వికాస పరీక్షను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.చందు, బాలికల కన్వీనర్ రేవతి, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి పాల్గొన్నారు.

### డ్రోన్లతో పిచికారీ మేలు

నరసన్నపేట: వరితో పాటు వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి డ్రోన్లను ఉపయోగించడం మేలని వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజీ అన్నారు. మండలం కిల్లాం, మాకివలసల్లో చెరుకు పంటపై పోషకాలను సోమవారం డ్రోన్లతో పిచికారీ చేసి చూపించారు. అలాగే క్రిమిసంహారక మందులు కూడా సులువుగా, వేగంగా పిచికారీ చేయవచ్చని అన్నారు.

## అయోధ్య-కాశీ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



అయోధ్య-కాశీ యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయోధ్య-కాశీ యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బస్సు నడిపేందుకు ఏపీఎస్ ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టిందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరాజు అన్నారు. అయోధ్య-కాశీ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ అయోధ్య-కాశీ యాత్ర పేరిట వివిధ పుణ్యక్షేత్రాలను 10 రోజులలో దర్శింపజేసే సదవకాశాన్ని ఆర్టీసీ చేపట్టిందన్నారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు తెలిపారు. అయోధ్య-కాశీ సంపూర్ణ యాత్రను భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సు నడపనుందని తెలిపారు. మనిషి ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ యాత్రలో 10రోజుల పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌ను ఆర్టీసీయే సమకూరుస్తుందని తెలిపారు. కాశీలో రూమ్ అకామిడేషన్, పడవ ప్రయాణ ఖర్చులు మాత్రం యాత్రికులే భరించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ యాత్రకు సంబంధించి ప్రయాణికులకు, భక్తులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7382921647, 7382919694, 7382919696, 9959225608 నంబర్లకు సంప్రదించాలని మల్లికార్జునరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం నరేంద్ర, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ భాషా, ఏడీసీ రాజు, ఎంపీ రావు, కె.సుమన్ తదితరులు ఉన్నారు.

## సమస్యలపై ప్రత్యేక దృష్టి: వీసీ



ఫిర్యాదులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బీఆర్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ లైవ్ డయల్ యువర్ యూనివర్సిటీ, గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులు, గ్రీవెన్స్ సెల్ కమిటీతో ఆమె సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సమీక్షించాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే విద్యార్థులు, విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. డిగ్రీ ఇయర్ ఎండ్ విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్షపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. వర్సిటీ, వర్సిటీ అనుబంధ కళాశాలల్లో జవహర్ నాలెడ్జ్ సెంటర్, నైపుణ్య కేంద్రాలు, ప్లేస్‌మెంట్ సెల్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అంబేడ్కర్ చైర్ ఏర్పాటు అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఔట్‌సోర్సింగ్ నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపైనా సమీక్షించారు. కోర్టులో వ్యవహారం ఉండటం వల్ల స్టాండింగ్ కమిటీ, న్యాయ నిపుణులు సూచనలు పాటించి ముందుకు సాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్‌రావు, కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్స్ డీన్ అనురాధ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



తాడు సాయంతో బావి బయటకు వస్తున్న మహిళ

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన 50 ఏళ్ల మహిళ వనజాన నీలవేణి ప్రమాదవశాత్తు పట్టణంలోని రామసాగర్ వెనుక ఉన్న చెరువులో పడిపోయారు. స్థానికులు గుర్తించి వెంటనే సోంపేట అగ్ని మాపక సిబ్బందికి తెలియజేశారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను బయటకు తీశారు. ఆమె ప్రాణాలతో బయటకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సిబ్బంది సీహెచ్ విజయకుమార్, పి.రామభద్రరావు, కేవీ రమణ, పి.వెంకటరావు పాల్గొన్నారు.

## అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఇచ్ఛాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం, డబ్బు వంటివి అక్రమంగా రవాణా చేయకుండా అడ్డుకుంటామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) ఎ.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పురుషోత్తపురం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ సూచనలతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వాహన చోదకులు, యజమానులు మధ్యవర్తితో ప్రమేయం లేకుండా రవాణా కార్యాలయానికి వచ్చి పనులు చేసుకోవాలన్నారు. ఎక్కడా పర్మిట్ల కోసం నగదు చెల్లించాల్సిన అవసరం లేదని, అన్నీ నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ వి.వెంకటరావు, ఏఎంవీఐలు దుర్గాప్రసాద్, కె.పార్వతి, అమృత ఎంవీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం**

పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఆవరణలో డీటీసీ డ్రైవర్లతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

## రూ.1.20కోట్లతో రైల్వేస్టేషన్ల అభివృద్ధి



పాతపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం మట్టిని ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం, టెక్కలి రైల్వేస్టేషన్లను రూ.1.20కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గత పది రోజులుగా పాతపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం ఎత్తు రెండు అడుగులు పెంచుతూ పనులు చేపడుతున్నారు. గతంలో రైలు బండి ఎక్కలంటే రైల్వే ప్లాట్ ఫారం కిందకు ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడేవారు. పాతపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంలో ప్రస్తుతం మట్టి నింపుతున్నామని, కాంక్రీట్, టైల్స్ వేస్తామన్నారు. టెక్కలి ప్లాట్ ఫారం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు.



## అటో బోల్తా.. 18 మందికి గాయాలు

సీతంపేట: మినప చేను తీతకు వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడిన ఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. మిగతా 15 మందికి స్వల్పగాయాలు కావడంతో సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహిసింగి ఆర్ఆర్ కాలనీకి చెందిన కె.హేమలత, డిల్లీశ్వరి, జి.ప్రసాదరావు, కె.పద్మావతి, కె.గంగమ్మ, ఎన్.దాలమ్మ, టి.సంజీవమ్మ, కె.రమణమ్మ, జి.అమ్మన్నమ్మ, ఎ.సరోజనమ్మ, జి.సరస్వతి, పి.అప్పలస్వామి, కె.గౌరమ్మ తదితరులు ఆటోలో పాలకొండ మండలం లక్కుపురం వెళ్తుండగా సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. పాలకొండ నుంచి కొత్తూరు వైపు వస్తున్న 108 సిబ్బంది ఈఎంటీ రాములు, పైలెట్ మోహన్‌రావులు ఘటన చూసి వెంటనే సపర్యలు చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో వైద్యం అందజేశారు. స్వల్పగాయాలైన వారికి చికిత్స చేసి ఇంటికి పంపించేశారు. హేమలత, లక్ష్మి, దాలమ్మలకు తలపై గాయాలు కావడంతో రిమ్స్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'కృష్ణను దాటారు'



పతకాలతో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కృష్ణా జిల్లా ఆక్వా వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కృష్ణా రివర్ పాసింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన రాకోటి కిశోర్, కనుగుల చంద్రబాను, కొర్ను వెంకటరావులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కొర్ను వెంకటరావు బంగారు పతకం సాధించారు. ఆయన ఏటా మన జిల్లా తరపున పాల్గొని మెడల్ సాధిస్తూ వస్తున్నారు. జిల్లాకు చెందిన వెంకటరావు సెక్షన్ ఆఫీసర్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ఏపీ సెక్రటేరియట్, అమరావతిలో పనిచేస్తున్నారు. రాకోటి కిశోర్, కనుగుల చంద్రబాను బెస్ట్ ఫినిషర్‌లుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్, పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు గంగరాజు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఆంధ్రప్రదేశ్ లైఫ్ సేవింగ్ సొసైటీ ఫౌండర్ నేషనల్ మెడలిస్ట్ స్విమ్మింగ్ కోచ్ షేక్ సుభం, ప్రెసిడెంట్ సీహెచ్ వెంకట్, వైస్ ప్రెసిడెంట్ తృప్తి రిసార్ట్ అధినేత తిరుపతిరాజు, రాష్ట్ర మస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దుప్పల వెంకటరావు, ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరవు, సెక్రటరీ రాజారావు, బాలాజీ, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



గురుమూర్తి(ఫైల్)

మందస: మండలంలోని మూలిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తెలుకుల గురుమూర్తి(60) సోమవారం వేకువజామున మరణించారు. కుమారుడి వివాహానికి శుభలేఖలు పంచడానికి వెళ్లిన ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తలవెనక భాగంలో గాయమవ్వడంతో 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు మూలిపాడు సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు గుసిరి వెంకటరావు ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన వైద్యం అందివ్వడానికి వైద్యులతో మాట్లాడుతూనే ఉన్నారు. మూడురోజుల పాటు చికిత్స పొందిన గురుమూర్తి దురదృష్టవశాత్తూ మరణించారు. ఆయన మృతిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

## పారామిలటరీ కానిస్టేబుల్ మృతి



దుంగ రాంబాబు (ఫైల్)

గార: ఇండియన్ టిబెట్ బోర్డర్ పోలీస్ (పారామిలటరీ) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట గ్రామానికి చెందిన దుంగ రాంబాబు (37) మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కెరియా జిల్లాలోని శిక్షణ కేంద్రంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కేంద్రంలోని బ్యారక్‌లోనే మృతి చెందినట్టు అక్కడి నుంచి ఫోన్‌లో సమాచారం వచ్చిందని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రాంబాబు అస్సాం ఐటీబీపీ రెజిమెంట్‌లోని కానిస్టేబుల్‌గా గత 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. రాంబాబుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంబాబు మృతి వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● మృతుడు వాండ్రంగి ఎంపీటీసీ భర్త



బాబూరావు (ఫైల్)

జి.సిగడాం: వాండ్రంగి ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి భర్త బూరాడ బాబూరావు రైలు ప్రమాదంలో మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబూరావు ఈనెల 3న రైల్వే లైన్ పక్కన ఉన్న పొలానికి వెళ్తూ పట్టాలు దాటారు. అయితే అదే సమయంలో పలాస నుంచి విశాఖ వెళ్లే రైలు, విశాఖ నుంచి భువనేశ్వర్ వెళ్లే రైలు రావడంతో ఆ రెండు రైళ్ల మధ్యన ఉండిపోయారు. ఆయన దివ్యాంగుడు కావడంతో బండి వేగానికి పట్టాలపై పడిపోయి మృతి చెందారు. ఆయన మన్యం జిల్లా బిటివాడ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీటీసీ శ్రీదేవిని పరామర్శించారు.